
# కాంగ్రెస్‌లో కల్లోలం... టికెట్‌పై గందరగోళం



తాండూరు, అక్టోబర్ 15: అధికార బీఆర్ఎస్ పార్టీ తాండూరు అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థిని ప్రకటించి నెల గడుస్తున్నా కాంగ్రెస్ పార్టీలోని ఆశావాహులు హైకమాండ్ పేర్లు ఎప్పుడు ప్రకటిస్తుందోనని ఆత్రుతతో ఎదురుచూస్తున్నారు. టికెట్ తమకే కన్ఫాం అయిందంటూ ఎవరికి వారే ప్రచారం చేసుకుంటున్నారు. టికెట్ వస్తదా..రాదో తెలియని కాంగ్రెస్ నేతలు సర్వేలన్నీ తమకే అనుకూలంగా ఉన్నాయని సోషల్ మీడియాలో డబ్బాకొట్టుకుంటున్నారు. జిల్లాలోని వికారాబాద్, పరిగి, కొడంగల్ ఎమ్మె ల్యే అభ్యర్థులను ప్రకటించగా తాండూరు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి టికెట్‌పై గందరగోళం నెలకొన్నది. బీఆర్ఎస్ పార్టీ నుంచి డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నికైన బుయ్యని మనోహర్ రెడ్డి పార్టీకి రాజీనామా చేసి తాండూరు కాంగ్రెస్ టికెట్ తనదేనని ప్రచారం ప్రారంభించారు. మరో వైపు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి తాండూరు అసెంబ్లీ టికెట్ తనకేనంటూ ప్రచారం చేస్తున్నారు. మరోవైపు బీసీ వర్గానికి చెందిన డాక్టర్ సంపత్‌కుమార్‌కు కూడా టికెట్ వస్తుందని చెప్పుకొంటున్నారు. ఇలా ఎవరంతకు వారు నేనే ఎమ్మెల్యే అభ్యర్థిని అంటూ ప్రచారం జోరుగా చేసుకుంటున్నారు. దీంతో కాంగ్రెస్ ముఖ్య నేతలతో పాటు కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు. కాంగ్రెస్ పార్టీలో కొందరు మనోహర్‌రెడ్డికి ఇవ్వాలని, ఇంకొందరు కేఎల్ఆర్‌కు ఇవ్వాలని, ఇంకొందరు సంపత్‌కుమార్‌కు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. ఇలా హస్తం నేతలు ఎవరికి ఇష్టం వచ్చిన రీతిలో వారు ప్రవర్తించడంతో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్ పార్టీలోకి స్వచ్ఛందంగా వలసలు ప్రారంభమయ్యాయి. తాండూరులో అసలు బీజేపీ ఊసే లేదు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి తగ్గట్లు ఉండడంతో తాండూరులో బీఆర్ఎస్ అభ్యర్థి రోహిత్‌రెడ్డికి వార్ వన్‌సైడ్ అయింది.

# మ్యానిఫెస్టో అద్భుతం

## ప్రతిపక్షాలకు దిమ్మదిరిగే పథకాలు : బీఆర్ఎస్ నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు

తాండూరు, అక్టోబర్ 15: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టిన బీఆర్ఎస్ మ్యానిఫెస్టో అద్భుతంగా ఉందని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ఆదివారం తాండూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కరుణం పురుషోత్తంరావు , మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప, పట్టణ మహిళా అధ్యక్షురాలు సంగీత ఠాకూర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రస్తుత పథకాలు కొనసాగిస్తూనే ప్రతిపక్షాలకు దిమ్మదిరిగే కొత్త పథకాలు ప్రవేశ పెట్టడం గొప్పవిషయమన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ ముందు చూపును ఎవరూ ఊహించలేదన్నారు. అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రవేశ పెట్టిన మ్యానిఫెస్టో ప్రతిపక్షాలకు చెంపపెట్టుగా మారిందన్నారు. దీంతో భారీ మెజార్టీతో అఖండ విజయం ఖాయమన్నారు. పెట్టుబడి సాయం కోసం రైతులకు ఏటా ఎకరానికి రూ.12 వేల నుంచి రూ. 16 వేలు, ఆసరా పెన్షన్ల లబ్ధిదారులకు రూ.1000 నుంచి రూ.3 వేలు పెంచుతూ ఐదేండ్లలో రూ.5 వేల నుంచి రూ.6016 వరకు పెంచుతామని ప్రకటించడం గొప్ప విషయమన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ గ్యాస్ సిలిండర్ ధరలను విపరీతంగా పెంచి, సామాన్యులపై తీవ్ర భారం వేస్తున్నది. ఈ భారం తప్పించేందుకు పేదలకు, జర్నలిస్టులకు రూ.400లకే గ్యాస్ సిలిండర్‌ను అందిస్తామని మ్యానిఫెస్టోలో పెట్టడం అందరికీ సంతోషానిస్తున్నదన్నారు. గడిచిన తొమ్మిదిన్నర ఏండ్లల్లో తాండూరు నియో జకవర్గంలో మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పాలనలో రూ.1672.49 కోట్ల అభివృద్ధి పనులు చేశామన్నారు. రూ.1648.12 కోట్ల సంక్షేమ పథకాలు ప్రజలకు అందించినట్లు తెలిపారు. ప్రతిపక్ష పార్టీ నేతల అసత్య మాటలను ప్రజలు నమ్మరాదని సూచించారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి పాటుపడుతున్న బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు ఓటు వేసి ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు రాంలింగారెడ్డి, నర్సింహులు, వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

# ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తే బహుమతులు ..



మాట్లాడుతున్న డిపో మేనేజర్ కరుణశ్రీ

పరిగి, అక్టోబర్ 15: ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి గ్రాండ్ ఫెస్టివల్ చాలెంజ్‌లో బహుమతులు పొందాలని పరిగి ఆర్టీసీ డిపో మేనేజర్ కరుణశ్రీ కోరారు. ఆదివారం పరిగిలోని ఆర్టీసీ డిపోలో ఆమె గ్రాండ్ ఫెస్టివల్ చాలెంజ్ జెండాను ఎగురవేసి మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి వచ్చే జనవరి 22వ తేదీ వరకు వంద రోజులపాటు గ్రాండ్ ఫెస్టివల్ చాలెంజ్ కొనసాగుతుందని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులు సైతం ఈ చాలెంజ్‌లో చక్కగా పనిచేసి అదనపు ఆదాయం తీసుకురావాలని సూచించారు. ప్రయాణీకులు బస్ టికెట్ వెనకాల వారి పేరు, ఫోన్ నెంబర్ రాసి ఆయా బస్‌స్టేషన్‌లలో గల గిఫ్ట్‌బాక్స్‌లలో వేయాలన్నారు. డ్రాలో గెలుపొందిన వారికి రూ.9900 విలువ గల బహుమతులు అందించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# మళ్లీ బీఆర్ఎస్‌దే అధికారం



పటాకులు కాలుస్తున్న బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు

పూడూరు, అక్టోబర్ 15 : తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీయే మళ్లీ అధికారంలోకి వస్తుందని ఎంపీపీ మల్లేశం పేర్కొన్నారు. ఆదివారం పూడూరు మండలం మన్నెగూడ చౌరస్తాలో సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టో విడుదల చేసిన అనంతరం పార్టీ నాయకులు పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మల్లేశం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పే మాటలను ప్రజలు నమ్మరని, జరిగే ఎన్నికల్లో పరిగి నుంచి మహేశ్ రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధిస్తారనే ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మిఠాయిలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వినోద్‌గౌడ్, పార్టీ నాయకులు అనంతరెడ్డి, అఖిమ్, జావీద్, దయాగౌడ్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఉపయోగకరమైన మ్యానిఫెస్టో



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

కులకచర్ల, అక్టోబర్ 15 : బీఆర్ఎస్ ప్రకటించిన మ్యానిఫెస్టో ప్రజలకు ఉపయోగకరంగా ఉందని కులకచర్ల బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, చౌడాపూర్ బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సత్తినేని సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం వారి మండలాల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రజల నాడి తెలిసిన వ్యక్తిగా ప్రజల అవసరాలను గుర్తించి వాటిని మాత్రమే మ్యానిఫెస్టోలో ప్రకటించి వాటిని అమలు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. పేదలకు రూ. 400లకు సిలిండర్, రేషన్ కార్డు దారులకు సన్నబియ్యం, రైతు బంధు, పింఛన్‌లు పెంచడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కులకచర్ల పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, బీఆర్ఎస్ నాయకులు మందిపల్ వెంకట్, నర్సింహులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా నవరాత్రులు ప్రారంభం



బొంరాస్‌పేట, అక్టోబర్ 15 : దసరా నవరాత్రి ఉత్సవాలు మండలంలో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజులపాటు నిర్వహించే నవరాత్రుల్లో అమ్మవారు నిత్యం వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఆదివారం అమ్మవారు బాలత్రిపురా సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. బొంరాస్‌పేటలో దుర్గామాత విగ్రహాన్ని భూలక్ష్మీ దేవాలయం చౌరస్తా నుంచి ఊరేగింపుగా తీసుకొనివచ్చి దుర్గామాత దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన మండపంలో ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. పోలేపల్లి ఎల్లమ్మ దేవాలయంలో హోమం నిర్వహించారు. తుంకిమెట్ల,మెట్లకుంట తదితర గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలకు భక్తులు పూజలు చేసి నైవేద్యం సమర్పించారు.

# ఎన్నికల ప్రక్రియకు సహకరించాలి

## తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్, రూరల్ సీఐ రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న తాండూరు డీఎస్పీ శేఖర్ గౌడ్

పెద్దేముల్, అక్టోబర్ 15 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు పోలీసు శాఖకు సహకరించాలని తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్, రూరల్ సీఐ రాంబాబు కోరారు. ఆదివారం పోలీసు స్టేషన్ ఆవరణలో అన్ని రాజకీయ పార్టీల నేతలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛగా ఓటువేసేలా సహకరించాలని సూచించారు. ఎన్నికల కమి షన్ ఆదేశాలను, నియమ నిబంధనలను పాటించాలన్నారు.ఎన్నికలకు సంబంధించిన ఏదైనా ఫిర్యాదు చేయాల్సివస్తే ''సీ-విజిల్ యాప్'' ద్వారా ఆండ్రాయిడ్ ఫోన్‌ల ద్వారా ఆడియో, వీడియో, ఫొటోగ్రఫీ రూపంలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఎన్నికల్లో భాగంగా జిల్లా ఎన్నికల అధికారిగా కలెక్టర్, రిటర్నింగ్ అధికారిగా ఆర్డీవో, నోడల్ ఆఫీసర్‌గా డీఎస్పీ ఉంటారన్నారు. పోలీసు శాఖకు ఎన్నికలు సజావుగా జరిగేలా అన్ని పార్టీల నాయకులు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ కాశీ నాథ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోహిర్ శ్రీనివాస్,జడ్పీటీసీ ధారాసింగ్, వివిధ పార్టీల నాయకులు పెండ్యాల ప్రవీణ్‌కుమార్ గుప్తా, విద్యాసాగర్, లొంక నర్సింహులు, రమేశ్, ఎల్లారెడ్డి, సందీప్, డీవై నర్సింహులు, ఆనందచారి, నసీర్, రంగయ్య, డీవై ప్రసాద్, యాదయ్యగౌడ్, గోపాల్, గౌరప్ప పాల్గొన్నారు.

## ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



పెద్దేముల్, అక్టోబర్ 15: మండల కేంద్రంలోని ముదిరాజ్ సంఘం కార్యాలయంలో మండల ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముదిరాజ్ జనచైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడిగా నాగభూషణ్, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడిగా ఖానాపూర్ మల్లేశం, ఉపాధ్యక్షుడిగా బోయిని నారాయణ, యువజన అధ్యక్షుడిగా లొంక రాములును ఎన్నుకొని సన్మానించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు తలారి వీరప్ప సంఘం బాధ్యులు దుగ్గాపూర్ శ్రీను, తలారి శ్రీనివాస్, కొత్త ఆనందం, అరవింద్ నరేందర్, సతీశ్ పాల్గొన్నారు.

## బెల్టుషాప్‌లపై పోలీసుల దాడి..



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

వికారాబాద్, అక్టోబర్ 15: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో వికా రాబాద్ సీఐ టంగుటూరి శ్రీను బెల్టుషాపులపై సిబ్బందితో ఆదివారం రాత్రి దాడులు చేశారు. ఇందులో భాగంగా అక్రమంగా అమ్ముతున్న 130 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నారు. ఆరుగురిపై కేసులు నమోదు చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున బెల్టుషాపులో మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. ఈ దాడిలో ఎస్సైలు అవినాశ్‌రెడ్డి, అనిత, సిబ్బంది ఉన్నారు.